# తిరుగుడు కప్పలు X

రచన:
"జ్ఞానశ్రీ"

**పాపం!...**

పరంధామయ్య ప్రేయసీ హీనుడు.

అంటే అతని భార్యా చనిపోయిందనీ కాదు, అతడు ప్రేమించలేనివాడనీ కాదు.

పరంధామయ్య ప్రేమించగలడు. హృదయాన్ని చీల్చి ఆ చీలికల్లో ఆడదాన్ని భద్రంగా దాచుకోగలడు. షిఫాన్ చీరలతోనూ...శిల్కులంగాలతోనూ... వెల్వెట్ జాకట్లతోను, ముంచెత్తగలిగే స్తోమత వుంది.

ఇన్ని అవకాశాలున్నా...అతగాడు ప్రేమించిన వయ్యారిభామ పరంధామయ్యను ప్రేమించలేదు. ఎంచేతంటే పరంధామయ్యే ఆమెను ప్రేమించేడు కాబట్టి—

అసలు సంగతేమిటంటే?

పరంధామయ్య తల్లిదండ్రులు నందరబ్బాయిలకి మల్లే, అతగాడికికూడా పెళ్ళిచేసేరు వో అమ్మాయిని. అందరమ్మాయిలకు మల్లే ఆ అమ్మాయికూడా కాపరానికి వచ్చి అత్తింట అడుగు పెట్టింది.

అడుగు పెట్టిందగ్గరనుంచి అంట్ల గిన్నెలు తోమటం మొదలు అత్తెసరు మెతుకులు దించేవరకూ గల సమస్త చాకిరీలే నెత్తినేసుకుంది.

భార్యంటే యిల్లాగే వుండాలి కాబోలు అనుకున్నాడు పరంధామయ్య.

అత్తింటి కాపురం యిల్లాగే వుంటుంది కాబోలనుకుంది ఆయన భార్యా.

పరంధామయ్యకేమో పెళ్లాం సరదా తీరుతూంది. గాని ఆ పెండ్లాన్ని యెల్లా చూసుకోవాలన్న తలంపు మాత్రం కలుగలేదు. అందరికి మల్లే తనకేవో ఆడది వుందని పొంగిపోయేడు. ఆ పొంగుతోబాటు 'షోకేస్' లోకి ఆడబొమ్మకు మల్లే అలంకరించి ఆనందించసాగేడు. అంతేకాదు, తన స్నేహితులతో కుషీగా షికారు వెళ్ళేటప్పుడు గర్వంగా బోరవిరిచి మరీ చెప్పుకున్నాడు. నా భార్యా నే చెప్పినట్టు వింటుంది. వినకపోతే నా తఢాకా యెరగదూ' అంటూ...ఆ అన్నమాట స్నేహబృందం నమ్మటంకోసం కాఫీ హోటల్లో కాఫీలుకూడా పట్టించేడు.

ఇంతా చేస్తే తీరా స్నేహితులంతా యేకమై, 'ఓరి నాయనమ్మో! నీభార్యా యేమేమిటీ? అందరి భార్యలూ వింటారు వాళ్ళభర్తమాటలని. ఇందులో గొప్పేముందిలే' అంటూ పరంధామయ్య అభిప్రాయాన్ని క్రొత్త చాపుని వుత్తరించినట్టు వుత్తరించేవారు. దాంతో పరంధామయ్య చప్పగా నీరుకారి చక్కా యింటికి పోయేవాడు.

ఈలాటి సన్నివేశాలు చాలాచాలా జరిగేయి. అసలు ఆడదాన్ని అనుభవిస్తున్నామనుకునే మగవాళ్ళంతా ఆ ఆడదే వాళ్ళని అనుభవిస్తున్నాదనుకోరు.

ఆలా అనుకుంటే మాత్రం సమాజంలో స్త్రీకి మంచి స్థానం యివ్వవలసి వుంది. ఇది మగవాడు సహించలేడు. అంచేత స్త్రీని యేదోలా లొంగదీయాలనుకుంటాడు. లొంగదీస్తాడు. ఆ లొంగిపోటంలో స్త్రీయే తనకు లొంగిపోయిందనుకుంటూ సంతోషిస్తాడే కాని తనే స్త్రీకి లొంగిపోయేననుకోడు.

ఈ నగ్నసత్యాన్ని తెలుసుకోలేని పరంధామయ్య తన పెళ్ళాన్ని భోళాయితన్నంగా హేళనచేస్తూ జులాయితనంగా అనుభవించేవాడు. అంచేతే తనయిష్టంకోసం ఆమెను కష్టపెట్టి ఆమెలోని అయిష్టతను రెచ్చగొట్టేడు. ఐనా ఆమె సహించింది. ఆలా సహించడానికి కారణం అదంతా సంసారతాపత్రయ మనుకోటమే.

ఆలా అనుకోవటం చేతనే వాళ్ళిద్దరిలో పొరపొచ్చాలు లేకుండా పోయేయి. ఉన్నా అంతా సంసారపు గుట్టుక్రింద జమై పోయింది.

లోకం మాత్రం ఆ జోడీని-వారి సంసారాన్నీ చూసి మురిసిపోయి మొహం మొత్తుకుని యేడ్చేది. యేడుస్తూ నవ్వేది.

ఐతే వున్నచిక్కంతా యెక్కడొచ్చిందంటే ఆయనగారిని ఆవిడగారు అర్థం చేసుకోలేకపోయింది. ఆవిడగారిని అతగాడు అర్థం చేసుకోలేకపోయేడు.

అందుకే ఆ సంసారంలో ఆ జోడీకి విసుగూ దానితోబాటు నిరాశా పుట్టుకొచ్చేయి.

విసుగును అతడు ముసుగులో దాచుకున్నాడు. నిరాశను ఆమె మనసులో యిముడ్చుకుంది.

దీనంతటికీ మూలకారణం పరంధామయ్య తల్లి. కాదంటే ఆమె అత్తగారు.

ఈ అత్తా కోడళ్ళ మధ్య పడితే రెండు జనతా ఎక్స్‌ప్రెస్‌ల మధ్యపడ్డ ఆబోతులా పచ్చడవుతామనే భావం పరంధామయ్యను ఋషి సమానుణ్ని చేసిపారేసింది.

అప్పుడప్పుడు పరంధామయ్య విసుగు చూపేవాడు. ఐతే ఆవిడ మాత్రం అర్ధరాత్రి పడకటింటిలో ఆవేశంతో ఉపదేసించేది ఆశాజీవితాన్ని. ఆమెకూడా ఆలాటి ఆశతోనే అత్తగార్ని కాదని బ్రతికేది కాబట్టి.

ఇంతవరకూ బాగానే వుంది కాని...ఆ తరువాతే పరంధామయ్య చరిత్ర మాంచి రసకందాయంలో పడింది.

పాతిక నెలలబట్టి జరిగిపోతున్న పరంధామయ్య తాలూకు దాంపత్యజీవితం...పటాసు కాయలా...చిన్న పిల్లాడి చేతిలోని రబ్బరు బెలూనులా...కళ్ళుమూసి తెరిచేంతలో పేలిపోయింది. దానిక్కారణం సంఘమే.

అసలు ఆ సంఘంతోబాటు పరంధామయ్యకు కూడా అందులో వాటా వుంది. ఇంతకీ అదేమిటంటే?

పరంధామయ్య భార్యా తెల్లవారేసరికి కనిపించకుండా పోటమే.

దాంతో ఆ వూళ్ళో (అదే వాళ్ళ లోకం) కల్లోలం బయలుదేరింది.

'లేచిపోయింది పోకిరీది' అంది లోకం.

'ఆ తంశంలో యెవరు కాపరం చేసేరులే' అన్నారు బంధువులు.


'పరంధామయ్య పెళ్ళాం లేచిపోయిందట...సంతాప సభ చేసి తీర్మానం పంపాలి.

అన్నారు మిత్ర బృందం.

'వెధవకి తగిన శాస్తి జరిగింది. నేను వాడి ప్రోనోటు బాకీ యెగ్గొట్టేనే అనుకో. నామీద దావా తెస్తాడా? భగవంతుడు లేడూ?'

అంటూ మీసం మెలివేసేడు శత్రుజాతిలోని ఓ మనిషి.

'చూసేదర్రా! పరంగాడి పెళ్ళాం పంచముడితో లేచిపోయిందట. అవ్వవ్వ యెంతఘోరం. బ్రహ్మంగారు చెప్పలేదుటే? ... లంతాను సానులై పోతారని. ఐనా వీడు మగాడు కాదుటలే. తిండికోసం బట్టకోసముటే మొగుడు? వీడేమో వట్టి మొద్దులాటివాడుటే. అదా మాంచి పైలా పచ్చీసులో వుంది. వీడా నిభా



యించలేని వెంగళాయి. పోకేం చేస్తుంది? ఐనా మన కెందుకులే యీ రట్టు.

అంటూ నీలవేణులూ - ధవళవేణులూ - వేణీ సంహారులూ-నీలాంటి రేవులూ నోటికి వచ్చినట్లు వాగుతూ దవడలు నొక్కుకున్నారు.

పరంధామయ్య తల్లి కోడలు పోయిందానికన్న కోడలి వంటిమీదనున్న పది తులాల బంగారం కోసం లబో దిబో మంది.

ఎంతమంది యెన్ని విధాలుగా అనుకుంటే నేం? సంఘం మాత్రం 'పరంధామయ్య పెళ్ళాం లేచిపోయింది' అని ముద్ర కొట్టేసింది.

ఎటొచ్చీ వెళ్ళిపోయిన పెళ్ళాంకోసం పరంధామయ్య ప్రాణాలు విడిచే పరిస్థితికి రాలేదు. అసలు యేమీ జరగనట్టే ఆనందంగా సినీమాలకీ, డ్రామాలకీ, కాఫీ హోటళ్ళకీ హాజరై మిత్రబృందం తాలూకు ఆనందాన్ని తనుకూడా పంచుకుంటున్నాడు.

ఈ ప్రవర్తన అందరికీ కంటక ప్రాయంగా వుంది. ఎంచేతంటే-

'ఏదైతే మనం సత్యం అనుకుంటామో అది అసత్యం ఐతేమాత్రం యేడుస్తూ యెదుటివాడ్ని యేడ్పించాలనుకుంటాం.

అంచేతే వాళ్ళంతా ఎల్లాగైనా పరంధామయ్యను యేడ్పించాలనీ, యేడుస్తూ వుంటే చూడాలనే ఎంతగానో ప్రయత్నించేవారు - వాళ్ళు ప్రయత్నించేకొద్దీ యీయనేమో వాళ్ళకి ఆనందించే మార్గాలు కోకొల్లలుగా చూపేవాడు.

'ఆనందం అందరికీ వుండదు. ఆ వున్న వాళ్ళైనా అది అందరికీ అందేలా చెయ్యరు?

పరంధామయ్య యీ కోవకు చెందినవాడు కాబట్టి తల్లి యెంత మొత్తుకున్నా అసలు రహస్యం చెప్పకుండా తనలో తనే ఆనందించేవాడు.

ఇది భరించలేక పోయింది వాడితల్లి.

నూతిలో పడుతానంది. ఉరి పోసుకుంటానంది. విషం త్రాగుతానంది. ఆస్తి యివ్వనంది. ఇంటిలోంచి గెంటిస్తానంది. ఇంకా యేమిటేమిటో అంది.

అనడమంటే అందికాని అసలు ఏమీ చెయ్యలేక పోయింది. ఆమె తత్వం తెలిసిన పరంధామయ్య పళ్ళికిలించి కులాసాగా ప్రక్కకు తప్పుకునేవాడు. అతగాడు తప్పుకునే కొద్దీ ఆవిడగారు తెగ ఆడిపోసుకునేది. ఆ నోటికి అంతే లేకపోయింది. పరంధామయ్య అవన్నీ సహించేడు.

సహించకేం చేస్తాడు మరి?

ఇక ఆ యింట్లో తనే తన భార్య. తన భార్య మనోతనూ? అవన్నీ తన భార్యామాత్రం పడలేదూ?

మంచి పువ్వులు పెట్టుకుంటే-

'సానిముండలా ఆ చెంగ్లేమిటే? చెప్పు తీసుకు కొట్టేవాళ్ళు లేక, అంటూ సాగదీసుకునేది.

తల దువ్వుకుని జడ వేసుకుని మంచి చీరా, రవికా ధరిస్తే చాలు-

'గర్భాదానపు పెళ్ళి కూతురులా ముస్తాబై కూర్చుంటే నీ మొగుడెవడు చేస్తాడే చాకిరీ.

అంటూ దులిపేది.

గిన్నెలు తెల్లగా మల్లెపువ్వుల్లా తోమితే!

'ఆరేళ్ళ రావలసిన గిన్నెలు ఆర్రోజుల్లోనే చిల్లులు పడితే కాపరం చేసినట్లే' విదిలించుకునేది.

పోనీకదాని... పైపైనే తోమితే!

'ఈలా మసితో వదితేయటానికి యిదేం మాల కొంపా మైలకొంపా కాదు అమ్మాయ్?

అంటూ సాధించేది!

అందుకే పరంధామయ్య భార్యలో నిరాశనిస్పృహ గూడు కట్టుకున్నాయి. పరంధామయ్య మనసులో పెళ్ళాని తలచుకుంటూ బైటకి తల్లిని మెప్పించేవాడు. ఈ ప్రవర్తనే లోకం కళ్ళల్లో ఖారం కొట్టింది. కళ్ళు విడని లోకం గుడ్డిగా సాగుతూ పోయింది. అదే పరంధామయ్యకు హుషారిచ్చింది.

భార్యా పరారైన రెండు రోజుల్లోనే పరంధామయ్య గారి పరమ రహస్యం బైట పడింది. పరంధామయ్య ఆనందం రెండు రోజులే కాపురం చేసి కాదని పారిపోయింది.

ఆ కథేమిటంటే!!!

కోడలిని పుట్టింటికి వెళ్ళకూడదని ఆజ్ఞ విధించింది అత్తగారు... వెళ్ళాలనే కాంక్షవుంది కోడలికి. దానికి నేడు ఆశ ఫలించింది. పరందామయ్య తండ్రి కావద్గ కాలం దగ్గరపడింది.

ఆమెగారు పవంధామయ్య చెవిలో కాస్త వార్త గప్ చుప్ గా చెప్పి పొంగిపోయింది. ఆపొంగును అలుతో బాటు తానూ పంచుకున్నాడు పరంధామయ్య ఫలితం పుట్టింటి ప్రయాణం. అమ్మ వప్పుకోదు. రహస్యంగా పంపాలి. ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చేశాడు.

వెట్టి చేసే మాలవెంగడిని సాయమిచ్చి తెల్లారేలోపల భార్యాని పుట్టింటికి పంపేశాడు. ఇదే పరంధామయ్య చేసిన పనివాడి తనం.

అదే అంత కరాకమేషుకి కారణం. మాల వెంకడి రాకతో అసలు రహస్యం బైట పడిందీ...అత్తగారు నోరు నొక్కుకుంది...అంతతో సరా???

లోకం ప్లేటు ఫిరాయించింది.

ఏ అమ్మలక్కలయితే ఆమె గురించి ఆడి పోసుకున్నారో ఆ అమ్మలక్కలే ఆమెనీ...ఆమెకు పుట్టబోయే గుమ్మడిపండులాంటి పాపాయినీ తలుచుకుని... చెప్పులు కొనుక్కునీ నానా రభసా చేసి కల్పించిన చెడ్డ భారాన్ని వెట్టిచాకిరీతోనూ... వెకిలిమాటలతోనూ మంచిగా మార్చడానికి మహా యిదై పోయేరు.

అందుకే పరంధామయ్య లోకులను ఉత్త తిరుగుడు కప్పలిక్రింద జమ కట్టేడు.

లేనిది వుందనుకుని బెకబెకలాడటం...తీరా అసలు సంగతి బైటపడే సరికి అది కాస్త తప్పించుకోటానికి దాట్లు వేయటం యిదంతా ఒక్క కష్టజాతికే వుంది.

ఈ అభిప్రాయమే పరంధామయ్యని పీడించి పీడించి చివరకి లోకులనందరినీ తిరుగుడు కప్పలన్నాడు.

ఎన్నంటేనేం...???

పురిటికెళ్ళిన పెళ్ళాం తిరిగి వచ్చేవరకూ.?

పాపం.

పరంధామయ్య ప్రేయసీ హీనుడే.

Telegram : ', LITHOGRAPH" Telephone : 58 & 75

THE NATIONAL LITHO PRESS

( ESTD. 1933 )

RAILWAY FEEDER ROAD, Post Box No. 30 SIVAKASI, S. I.

దక్షిణ భారతంలో ఖ్యాతిగాంచిన ముద్రణాలయం !!

దినేషనల్ లితో ప్రెస్ - శివకాశి

నిపుణులైన పనివారలచే మా ప్రెస్‌లో అందమైన విధంగా అగ్గి పెట్టె, బీడి, మిల్, సోప్ ఫైర్ వర్క్స్, బట్టలు, కాపీ, టీ, మిఠాయి, సోడా మొదలయిన వాటికి కావలసిన లేబిల్సు, మరియు పెట్టెలు, లితోలోను, ఆఫ్ సెట్ లోను అచ్చువేసి ఇవ్వబడును.

చిత్రాలుగల కాలెండర్లు "ఫోటో ప్రాసెస్" మూలంగాను ఆఫ్ సెట్ పద్ధతిలోను తయారుచేసి ఇవ్వగలము.

ఆకర్షణీయమైన పలురంగులలో పువ్వుల బార్డర్లలో పల వివాహమహోత్సవాహ్వాన పత్రికలు రెడీమేడ్ గా మావద్దనున్నవి.

ముద్రణాలయములకు కావలసిన లితో, ఆఫ్ సెట్ ఇంకులకు :—

గిరిశెన్ ప్రింటింగ్ ఇంక్ ఫ్యాక్టరీ - శివకాశి

వారికి వ్రాయండి.